

గాంధీ శతకము.

గ్రంథకర్త:—
చొల్లేటి నృసింహాశర్మ కవి.

ప్రకాశ ముద్రాక్షరశాల, సూర్యాపేటలో ముద్రితము.

9 9

" సరస రస భార పూరిత
మురళీధరు కరుణ మో. క. ♦ మోహన గాంధీ
చరితామృతరసపానము
పరితృప్తుని జేయ జన్మ ♦ పావనమయ్యెన్. "

బ్ర॥ శ్రీ॥ చిదంబరశాస్త్రిగారు,
చిక్కడ్‌పల్లి,
హైదరాబాదు. (దక్షిణ)

-:విజ్ఞప్తి:-

"అసతో మా సద్గమయ"
"తమసో మా జ్యోతిర్గమయ"
"మృత్యోర్మా అమృతం గమయ"

బాపూజీని యుగ పురుషుఁడనియు, ఋషియనియు, మహాత్ముఁడనియు పిలచుచున్నారు. నిజంగా ఆయన సర్వోత్తమ మానవ లక్షణ లక్షితుఁడైన యాథార్థ్యాత్మిక పురుషుఁడు. దౌర్జన్య రాహిత్య విప్లవబ్రహ్మ. అప్రతిహత విభాసిత రాట్నచక్ర చక్రపాణి. అవిలుంఠితానన్య సామాన్య విలసిత సత్యాగ్రహ పాశుపతధారి. శాశ్వతానంద మోక్షసామ్రాజ్య ప్రాప్తికర వేదాంత సూత్రభాషి. భారత భాగ్యాభ్యుదయ విధాత. ఉదాత్తానుకంపపూర్ణ సర్వసమ్మత మత చక్రవర్తి. అసహనాతినికృష్ట లంపట జీవ ప్రీత పవిత్ర హృదయ కరుణా మూర్తి. సంకల్ప వికల్ప ప్రాయ మనోవిజయ తాపసి. జాతీతర కృతానివార్యావమానాది హాలాహల వశంకర శాంకరావతారి. భావోద్రేక గుప్త. విజేత బ్రహ్మచారి. రాజకీయవేత్తల తలమానికము అవిచ్ఛిన్నాహింస ధర్మచారి. ఖండఖండాంతర సంస్తవనీయ యశసావృత భారత జననీ జగజ్జేగీయమానైకైక పుత్రుఁడు. సర్వమానవ పూతనీయ తేజోమయావిశ్వాసితోత్కృష్ట శాంతమూర్తి. భారతీయ ద్వేషరోగ నివారిత భిషగ్వరుఁడు. వివిధకళావృత్త్యానుబోధక దేశికుఁడు.

ఇట్టి మహాత్పురుషుఁడగు మోహన్‌దాస్ కరంచంద్ గాంధి గారి 78 వ జన్మదినోత్సవ సందర్భమున వారికి కానుకగా అల్పజ్ఞుఁడ నగు నేనీ శతకము వ్రాసి సమర్పించుకొంటిని.

గ్రంథ ప్రకటన కాలము వఱకు శ్రీవారు పరమపదించుటచే నిర్యాణ కాలమందు వ్రాసిన అశ్రు తర్పణ పద్యము లిందుఁజేర్చితిని.

దేవరొప్పుల.
8—8—1949

ఇట్లు
చోళ్లేటి నృసింహ శర్మ కవి.

విషయానుక్రమణిక.

శ్రీ

మో. క.
గాంధీశతకము.

క. శ్రీరమణుడు గౌరీరమ
ణీరమణుడు వాక్సతీమ ♦ ణీ రమణుండున్
శ్రీరస భృతులిడి బ్రోచుత
కారుణ్య పయోధి మో. క. ♦ గాంధి మహాత్మున్ ౧.

—: బాల్యాది చరిత్ర :—

క. కూరిమితో నీజననియు
బ్యారెట్ లా చదువుటకును ♦ పంపుచునపుడున్
సారాయి ముట్టవద్దని
గారబమున జెప్పె మో. క. ♦ గాంధి మహాత్మా! ౨.

క. ఆరీతి నడచి ముదమల
రారగ కనతల్లిమాట ♦ లాలించిన నీ
చారిత్రము గనకయె ని
ష్కారణ మ్మతినొందె; మో. క. ♦ గాంధి మహాత్మా! 3.

క. పరపురుషుల గనెననుచును
నిరతము కస్తూరిబాను ♦ నిందించితినం
చఱముటి లేకను వ్రాసితె
కరములు జోడింతు; మో. క. ♦ గాంధి మహాత్మా! ౪.

గాంధీ శతకము.

క. మరులుగొని నగలు దెమ్మను
నరనారుల గుణము నేర్వ ♦ నగు కస్తురిబా
దరి యొజ్జతనము సంస్తుతి
కరము కర్మయోగి; మో. క. ♦ గాంధి మహాత్మా! ౫.

క. ముఱయుచు నాఫిరకేయులు
కరముగ నగలెన్నొ నిడిన ♦ కానుకలోనన్
తరుణియడుగ సంస్థకిచ్చితె
కరుణాకర ఋషివి; మో. క. ♦ గాంధి మహాత్మా! ౬.

క. మఱువదు నిను నాఫిరికా
పరతంత్ర్య విముక్తి రీతి ♦ భారత ప్రజకున్
పరపంథి బాధ బాపెదో
కరములు జోడింతు; మో. క. ♦ గాంధి మహాత్మా! ౭.

క. బిరుసుదనము చూపియు నిను
మొఱటువటంచన్న యాంగ్ల ♦ మూకను గీతా
వర పాశు బద్ధుజేసితి
కరములు జోడింతు; మో. క. ♦ గాంధి మహాత్మా! ౮.

క. గోరక్షణ సంఘంబులు
దూరెను నిను రోగి గోవు ♦ దునుమన్ శాంతిన్
వారక రోషము బాపిన
కారుణ్యాంబోధి; మో. క. ♦ గాంధి మహాత్మా! ౯.

—:హరిజనోద్ధరణ:—

క. హరిజనజాలము నెట్లో
దరిజేర్చగ కంకణమ్ము ♦ దాలిచి నిందల్
సరకుం జేయక మెలగెదొ
కరుణాత్ముడ వీవు; మో. క. ♦ గాంధి మహాత్మా! ౧౦.

క. ఘోరంబౌ యస్పృశ్య ని
వారణ సంపూరణేచ్ఛ ♦ వరదంబనుచున్
ధీరత జాటితివి బహి
ష్కార విదూరాత్మ; మో. క. ♦ గాంధి మహాత్మా! ౧౧.

క. సరసను జనిసంతనె భూ
సుర లొల్లని జాతివారు ♦ చొరుచుండిరిగా
హరిజనులు మందిరమ్ముల
కరమని నీ కృషిని; మో. క. ♦ గాంధి మహాత్మా! ౧౨.

క. హరిజనులే నీప్రాణము
హరిజనులే నీకు దేవ♦తా రాధకులున్
హరిజన పోషణజేసితి
కరముగ ఋషివర్య; మో. క. ♦ గాంధి మహాత్మా! ౧౩.

—:రాట్నము:—

క. భారత కోటీశ్వరులను
రారమ్మని జేరబిలిచి ♦ రాట్నము ద్రిప్పన్
నేరుపు దగు నెఱజాణవు
కారుణ్యాంబోధి; మో. క. ♦ గాంధి మహాత్మా! ౧౪.

క. ఆరాటము యారాటము
పోరాటము మాన్పి కాయ ♦ పుష్టికలుంగున్
వారక రాట్నము వడికిన
కారణమున గాద; మో. క. ♦ గాంధి మహాత్మా! ౧౫.

క. ధరియింపుము దేశపు ఖ
ద్దరునంచును దానిచేత ♦ దారిద్ర్యంబుల్
దరిజేరవంచు బోధల
కరముగ జేసితివి; మో. క. ♦ గాంధి మహాత్మా! ౧౬.

గాంధీ శతకము.

క. అఱుసాచగ నందనిఫల
మరయగ రాట్నంబు దాన ♦ నందుము రాజ్యం
బరశ్రేదు సత్యహింసా
కరమగు కృతియద్ది; మో.క. ♦ గాంధి మహాత్మా! ౧౭.

క. వరలుదురు నలుబదికో
ట్లరప్రజ రాట్నంబు వడుక ♦ హర్షించెదనం
చటిముటి పలికెదు నుడియను
కరణీయము మాకు; మో.క. ♦ గాంధి మహాత్మా! ౧౮.

క. దూరపిల్లు దేశమాతకు
చరఖాయే రక్షణంబు ♦ శాంతిదము మహ
త్తర సుఖప్రదమని జాటెదు
కరములు జోడింతు; మో. క. ♦ గాంధి మహాత్మా! ౧౯.

క. తరతరముల నుండియు మే
మెఱిగిన ధర్మముసై జెప్పి ♦ యిది చేయుడనన్
నిరసించు రోజులరిగెను
కరముల జోడింతు; మో. క. ♦ గాంధి మహాత్మా! ౨౦.

క. మఱుగుపెరట ముత్తుత్రిప్పెడు
చరఖాయంత్రంబు రాజ్య ♦ సాధనమగునం
చరసెడు దివసము మడసెను
కరములు జోడింతు; మో. క. ♦ గాంధి మహాత్మా! ౨౧.

క. తఱగెను మల్మల్ బట్టలు
చరఖా యింటింట వెలసె ♦ చేనేతలకే
ధర బెరిగె నీ మహత్తిది
కరములు జోడింతు; మో. క. ♦ గాంధి మహాత్మా! ౨౨.

:కాంగ్రెసు గాథ:

క. నౌరోజీ వేడర్బన్
శూరుఁడు హ్యూమ్ ముగురు మిగుల ♦ చొప్పడి గూడన్.
భారత కాంగ్రెస్ సంస్థకు,
కారణ భూతులరు; మో. క. ♦ గాంధి మహాత్మా! ౨౩.

క. మారె ప్రభుత్వపు వైఖరి
కూరిమి కాంగ్రెసు వారు ♦ కోరినరీతిన్
భారత నష్టముపై యధి
కారము చర్చించ; మో, క. ♦ గాంధి మహాత్మా! ౨౪.

క. కరజను, మింటో, వంగను,
ఇరు విభజన జేసిరంచు ♦ నెగ్గులు పలుకన్,
దొరకొనిరి. విప్లవంబులు
కరముగ చెలరేగ ;మో. క. ♦ గాంధి మహాత్మా! ౨౫.

క. తిరుమంత్రము వందేమా
తరము ప్రబలె, తెల్లవారి ♦ తరలింపంగన్,
బిర నడుముగట్టి విప్లవ
కరు లతి మోదమున; మో. క. ♦ గాంధి మహాత్మా! ౨౬.

క. తరుణము గని మార్లేతో,
సరగున యోచించి కార్య ♦ శాసన సభలన్
మఱి కొన్ని హక్కు లిచ్చెను,
కరుణను మింటోను; మో. క. ♦ గాంధి మహాత్మా! ౨౭.

క. ఐరోపా రణమందున
ఘోరున ప్రాణముల ధార ♦ పోసిరి దానన్
స్వారాజ్య మిత్తు రనియెడు
కాఱు మాట వినియు; మో. క. ♦ గాంధి మహాత్మా! ౨౮.

క. దొరసాని అనిబిసెంటూ
త్వరగతి హోం రూలు లీగు ♦ స్థాపింపంగా
మురయుచు తిలకు, బెనర్జి
గరితకు తోడైరి; మో. క. ♦ గాంధి మహాత్మా! ౨౯.

క. నిరసింపగ 'రౌలట్ లా'
పరముగ 'జలియన్వాలబాగు' న గూడన్
దురితముగ కాల్పు గాల్చిరి,
కరుణే లేకుండ; మో. క. ♦ గాంధి మహాత్మా! 30.

క. ఉరి కంబంబున నుంచిరి
ఉరిబడ భగదత్తుసింగు ♦ నోహో! యన ని
ర్ఝరి బయలుదేరె నంతట
కరుణాకర యోగి; మో. క. ♦ గాంధి మహాత్మా! 3౧.

క. పరమదయాళుఁడు జార్జి
"మఱచిపొందు గతము" ననుచు ♦ మన నోదార్పన్,
దురితు బంట్లు దొలగించియు
గరిమ నొకని బంపె; మో. క. ♦ గాంధి మహాత్మా! 3౨.

క. అరుదెంచెను "రీడింగూ"
అరుగుదెంచి తీవ్రగూడ ♦ నాఫ్రిక నుండిన్,
శిరమెత్తి 'రలీ యనుజులు'
ఖరకరు లన నొప్ప మో. క. ♦ గాంధి మహాత్మా! 33.

క. తిరుమంత్రము, ఘనతంత్రము
దురితమ్ములు కొంచెమైన ♦ దోపగనీకన్,
జరిపితివి సహాయ నిరా
కరణము వా నొప్ప; మో. క. ♦ గాంధి మహాత్మా! 3౪.

క. స్వారాజ్యము బొందగను న
పారముగా పోరి నోడె ♦ బార్డోలి మలా
బారున చౌరీచౌరన
కారణ యల్లరులు; మో. క. ♦ గాంధి మహాత్మా! ౩౫.

క. పరువెరుగక నిను నలి సో
దరులను, లాలాను ముందు ♦ దరిగా నమిచేన్
చెఱబెట్టిరి మీదగుసం
స్ఫురణ మబోధ్యంబు; మో. క. ♦ గాంధి మహాత్మా! ౩౬.

క. నిరతము మానవ సేవయె
పరమాత్ముని సేవయంచు పాటుపడు నినున్
చెరఁ బెట్టిరి దుష్కర్ములు
కరముగ బాధించి; మో. క. ♦ గాంధి మహాత్మా! ౩౭.

క. ఎఱవాడ చెఱను నుంచిరి
సుర కళ పుంజంబుతోడ ♦ శోభిలెడు నినున్
దురితులు పాశ్చాత్యులు నా
గరికుల మనువారు; మో. క, ♦ గాంధి మహాత్మా! ౩౮.

క. ధీరత ' కర్ఫ్యూ అర్డరు '
చూరగొంటి వెన్నో సార్లు ♦ చోద్యము గాగన్
చౌరుల చెర్యపు వెన్నెల
కారడవిని గాయ; మో. క. ♦ గాంధి మహాత్మా! ౩౯.

క. దొరతనమువారి తీర్పుల
నరికట్టగ నెహ్రూ, దాసు ♦ నవ్యవిధంబున్
పరిపాలన పార్టీ విధి
గలిపిరి నెలకొల్పి; మో. క. ♦ గాంధి మహాత్మా! ౪౦.

క. ఇరివిను ప్రభు కాలంబున
అరుదెంచెను సైమననెడు ♦ నద్భుత కమిషన్
మరలెను ఫెడరేషను కిం
కరణంబని నడుగ; మో. క. ♦ గాంధి మహాత్మా! ౪౧.

క. అరమర లేకను నిర్విను
దొర లేబరు మంత్రులకును ♦ దోపగ జెప్పెన్,
జరుపుట రౌండు టేబుల్, స
త్కారమంచని వేగ; మో. క. ♦ గాంధి మహాత్మా! ౪౨.

క. వారిచ్చు వరము వద్దను
కారణమును నూతగొనుచు ♦ గాసిల జేయన్,
క్రూరతఁ జెఱఁబెట్టెను, మమ
కారత యది గాదె; మో. క. ♦ గాంధి మహాత్మా! ౪౩.

క. ఇరువది యొక్క దినంబులు
నిరుపమ యుపవాస దీక్ష ♦ నీరస మొందన్,
భరతావనికై యక్కట!
గరపితివో, నీవు; మో. క. ♦ గాంధి మహాత్మా! ౪౪,

క. నెర వేరని కార్యములకు,
పరగను సత్యాగ్రహంబు ♦ ప్రాకృత ఖడ్గం
బరి దమన కహింసా యను
కరవాలము నీకు; మో. క. ♦ గాంధి మహాత్మా! .౪౫

క. సిరి సంపదలను విడచియు
భరతాంబకు సేవ జేయ ♦ భార్య, కుమారున్,
వెరవక వెనుగొనుటయె స
త్కార మంచును చాటు; మో. క. ♦ గాంధి మహాత్మా! ౪౬.

క. నిరుపేదపు దేశంబున
సరస స్నేహానువృత్తి ♦ శాంతి స్థిరతన్
భరియింతు వ్యథల నన్నిటి
కరువను నది లేదు; మో. క. ♦ గాంధి మహాత్మా! ౪౭.

క. వరుసగ నొకటియు, రెండును
జరిగెను రౌండ్టేబు లనెడు ♦ సభ ముమ్మారున్
నిరసించిరి లవణముపై
కఱమేటి కటంచు; మో. క. గాంధి మహాత్మా! ౪౮.

క. ఓరిమితో 'మెక్డొ నాల్డు'
కూరిమి మీ కిరువురకును ♦ కుదురు వరకు తా
పేరొంద విధిని నిరుపమ
కారకుఁడై మెలఁగ; మో. క. ♦ గాంధి మహాత్మా! ౪౯.

క. మతిమఱల సహాయ నిరా
కరణము సాగించ బంది♦ఖానం బెట్టన్
నిరశనము బూనినాడవు
కఱకుల హృది గరుగ; మో. క. ♦ గాంధి మహాత్మా! ౫౦.

క. విరమింపగ 'కన్సెర్వేట్'
పరిపాలన విలింగుడన్ను ♦ ప్రభువుగ వచ్చెన్
త్వరలో బ్రకటింతును సం
స్కరణం బని నుడివె; మో. క. ♦ గాంధి మహాత్మా! ౫౧.

క. భోయన జేరితి లండను
దారుణ చలి బాధ నెట్లు ♦ తాళితి వయ్యా!
భారత బంధ విమోచన
కారణముగ నేగి; మో. క. ♦ గాంధి మహాత్మా! ౫౨.

క. కొలఁగాని కొడుకు తప్పులు
తలఁగుకొనఁగ కడుపు తీపి ♦ తా నెంచియు ని
బ్బరముగ మెదిలితి వహహా!
కరుణామయ నీవు; మో. క. ♦ గాంధి మహాత్మా! ౫౩.

క. మెలఁగైన నీదు టోపీ
వెలుపును పుట్టించె రాజ్య ♦ వేత్తల తల నీ
వలుకను తత్వ మెఱుంగరు
కరములు జోడింతు; మో. క. ♦ గాంధి మహాత్మా! ౫౪.

క. ఇరు ఇరువది కాంగ్రెస్ సభ
జరిగెను బెల్గామునందు ♦ జయముగ ని న్న
త్తరి యధ్యక్షుగ నిల్పిరి
కరుణాకర ధీర ; మో. క. ♦ గాంధి మహాత్మా! ౫౫.

క. తిరిగెను నెత్తితి దేశము
కొరకై, నిరుపేదవయ్యు ♦ గొంకక, పాలే
పరమాన్నంబులు ఫలములు
కలు వెలుఁగని తిండి; మో.క. ♦ గాంధి మహాత్మా! ౫౬.

క. నీరేజాసన ప్రభృతులు
తేరయ్యా తత్వ మెఱుఁగ ♦ తేశం బైనన్
భారత కీర్తి విధాతవు
కారుణ్యాంబోధి; మో.క. ♦ గాంధి మహాత్మా! ౫౭.

క. తరమే నిను పొగడఁగ త
త్తరపడు గంటంబు, ముసలి ♦ తాతవు మాకున్
బిరుదు మహాత్మా! వడసితి
కరుణాకర శూర; మో. క. ♦ గాంధి మహాత్మా! ౫౮.

క. విరివిగ వానర సేనగ
బరగిరి కాంగ్రెసు సభ్య ♦ పదవికి జన మ
త్సర వదనులు మఱియు నిర
త్సర కుత్సులు గూడ; మో. క. ♦ గాంధి మహాత్మా!

క. మిరియాలు నూరి వచ్చిన
పరిపంధియు నిన్ను జూచి ♦ ప్రాణాత్మలియు, నిన్
దరిజేరి సంధి గూర్చును,
కరుణాకరమూర్తి; మో. క. ♦ గాంధి మహాత్మా! ౨౦.

క. కూరిమి స్వాతంత్ర్యంబును
నేరుపుగా పొంది పిదప ♦ నే చత్తు నన్
భారత జనని హసించెను
కారుణ్యాంబోధి; మో. క. ♦ గాంధి మహాత్మా! ౨౧.

క. తరువాత రౌండుటేబుల్
జరిగెను కాంగ్రెసు రహిత ♦ సహకారముతోన్,
నిరణయమై 'వైటుపేపరు'
కరపత్రము వెడల; మో. క. ♦ గాంధి మహాత్మా! ౨౨.

క. హరిజన సవర్ణు లిద్దఱు
మురియుచు నొడబడిరి కలిసి ♦ పూనాలోనన్,
నిరసన భావన లేకను
గరపిన నీ బోధ; మో. క. ♦ గాంధి మహాత్మా! ౨౩.

క. ఆఱు నొక్కొకటి కాంగ్రెస్
వారలు మంత్రిత్వపదవి ♦ వహియించుటకున్
ధీరత నొప్పిరి గవర్నర్
గారలు లోఁగుంద; మో. క. గాంధి మహాత్మా! ౨౪.

క. సరియనగా లిన్లిత్ గో
మతి భేషని రాజకీయ ♦ మాన్యులు మెచ్చన్
ఇరువర్షంబులు నేలిరి
గరువము లేకుండ; మో. క, ♦ గాంధి మహాత్మా! ౬౫.

క. ఘోరంబౌ రణరంగము
ప్రారంభంబయ్యె క్ష్మామ ♦ బాధలుఁ గలిగెన్,
కోరిరి యాంగ్లేయులు సహ
కారము కాంగ్రేసు మో. క. గాంధి మహాత్మా! ౬౬.

క. పరదేశీ 'స్టాఫర్డు క్రిప్సు'
సరసత గొని వచ్చి నట్టి ♦ సందేశ మెడన్
నిరసన చూపగ బందీ
కృతులైతిరి ముగురు; మో. క. ♦ గాంధి మహాత్మా! ౬౭.

క. పరమ తముఁడు దేశాయీ
పరమపదము జేర యమిత ♦ బాధలు కలిగెన్
దొరకఁ డిఁక నిట్టి ప్రియుఁడగు
కరజ విదగ్ధుఁడు; మో. క. ♦ గాంధి మహాత్మా! ౬౮.

క. గురు తర గుణ ఖని యగు క
స్తురిబా నినుఁ బాసె చెలియ ♦ క్షోభించి మదిన్,
కఱకులు తెలజాతుల ము
ష్కర కృతి కెరయయ్యె; మో. క. ♦ గాంధి మహాత్మా! ౬౯.

క. మారణ మంత్రోపాసక
వీరుఁడు మన నేత యిపుడు ♦ 'వేవెల్' గుణ వి
స్తారులు కాంగ్రెస్ మంత్రులు
కారుణ్యాంబోధి; మో. క. ♦ గాంధి మహాత్మా! ౭౦.

క. అఱువది సంవత్సరములు
తిరిగితి నిష్కామ యోగి ♦ దేశికుఁడవుగా
మురిపెము గలిగెను ముందిఁక
కరణీయము లేదు; మో. క. ♦ గాంధి మహాత్మా! ౭౧.

—: ఇ త ర ము లు . :—

క. సరిహద్దున నొక గాంధీ
వరలెను, నీపేరు బలిమి ♦ వర్ధిల ఖ్యాతిన్
బరగెను సజ్జన సంగతి
కరముగ నట నొప్పు; మో. క. ♦ గాంధి మహాత్మా! ౭౨.

క. పరధనముల నాసింపవు
పరభాషల వాదములకు ♦ భాషింపవు యే
హారమును పాటును వదలవు
కరణీయ కృతార్థ; మో. క. ♦ గాంధి మహాత్మా! ౭౩.

క. అరి యొక చెంపను గొట్టగ
మఱియొక చెంపందనీయ ♦ మానును వాడే
దురితమును నవ్వ బోధను
గరపిన నిష్కామ; మో. క. ♦ గాంధి మహాత్మా! ౭౪.

క. కారాకు డుల్లు నట్లుగ
భారత శృంఖలము డుల్లె, ♦ పావన మయ్యోన్
మీ రొనరించిన కృషియే
కారణము గదయ్య; మో. క. ♦ గాంధి మహాత్మా! ౭౫.

క. నీరస మున్నను మానవు
వారంబైనను తదేక ♦ వాంఛల తీర్పల్
వారక జరుపుచు నుందువు,
కారుణ్యాంబోధి. మో. క. ♦ గాంధి మహాత్మా! ౭౬.

క. నిరశన వ్రతముల చేతను
పరిశ్రమ మధికంబు చేత ♦ పాటవ ముడిగెన్,
మఱి రాట్నయంత్ర మెప్పుడు
కరవీతము గాదు; మో. క. ♦ గాంధి మహాత్మా! ౭౭.

క. ధరితము ఖద్దరు, విమనో
భరితము స్వారాజ్య కాంక్ష; ♦ భారత మాతా
చరితము, సజ్జననము, హిత
కరితము కృషి కర్మ; మో. క. ♦ గాంధి మహాత్మా! ౭౮.

క. పరమతముల నిందింపవు
పొరుగు జనుల తోడి గిల్లి ♦ పోరాడవు, యె
వ్వరికి నపాయము తలపని
గరిముడ వీవరయ; మో. క ♦ గాంధి మహాత్మా! ౭౯.

క. పరుల మనమునకు నెప్పుడు
పరుసదనము దోచునట్టి ♦ బాటలవిడి నొ
ప్పరికించు త్రోవఁ జూపితి
కరుణాకర నీవు; మో. క. ♦ గాంధి మహాత్మా! ౮౦.

క. ఆఱువదిపై పదునెనమిది
నిఱుప్ప కొనగ జన్మ దినము ♦ లెంతో ప్రీతిన్
జరిపిరి గైకొను డిదిగో
కరుణను, నాకృతిని; మో. క. ♦ గాంధి మహాత్మా! ౮౧.

క. వయస నహింసా పాఠం
బటేముటి బోధించ నింక ♦ నారసి వర్ధా
సరసత సేవా గ్రామము
కరణిని పొందించు; మో. క. ♦ గాంధి మహాత్మా! ౯౨

క. బారెడు దారపు బారను
నారాముఁ డహర్నిశంబు ♦ నాట్యంబాడున్,
పేరిమిగల తత్వపు నుడి
కారం బమలంబు. మో. క. ♦ గాంధి మహాత్మా! ౯౩

క. భారత పాంచాలికి నిడి
చీరలు మానంబు గాచి ♦ చెలఁగిన వనితో
ద్ధారా! రాట్నపు చక్రీ!
కారుణ్యాంబోధి; మో. క. ♦ గాంధి మహాత్మా! ౯౪.

క. భారత స్వతంత్ర్య లక్ష్మి
చోరుల దరినుండి మరల ♦ సాధించిన సీ
తా రామా నతు లివిగో
కారుణ్యాంబోధి; మో. క. ♦ గాంధి మహాత్మా! ౯౫.

క. పర దేశము లందును ని
న్నెఱుగని శిశువైన లేడు ♦ యిలలో పూర్వం
దరు నోము లేమి నోచెనో
కరుణాకర ప్రణుతి; మో. క. ♦ గాంధి మహాత్మా! ౯౬.

క. పరగు జననంబు నక్టో
బరు నందున నందుచేత ♦ ఫసలీ యేడున్
సరి దిద్దిరి గణితమున సు
కరమగునని గాదె; మో. క. ♦ గాంధి మహాత్మా! ౯౭.

క. నిరతము ప్రసరిత ఛాయా
గురుతులఁగని మెలఁగె దేవి ♦ కొలఁకుల నక్షుల్
మరణించవచ్చె నప్పుడె
గరిత సేవఁ దలఁచి; మో. క. ♦ గాంధి మహాత్మా! ౫౮.

క. భరతావని శకలములుగ
తురకలు హిందువులు జేయ ♦ దొడగుట తగ దం
చఱిముఱి తెల్పితి హృదయా
ల్కరుగవు కాసంత; మో. క. ♦ గాంధి మహాత్మా! ౫౯.

క. ఖారీ ధోవతి కట్టక
మూరెడు గోచియయె మేలు ♦ ముసుఁగులు గాగన్
జారిజితో భాషించిన
కారుణ్యాంబోధి; మో. క. గాంధి మహాత్మా! ౬౦.

క. జరుపరు మిము నడుగక సం
స్కరణము లేవైన నెహ్రూ, ♦ చారియు, నాజాద్,
మఱి జిన్నా ప్రభులు సహితము
కరుణాకర యొజ్జ; మో. క. ♦ గాంధి మహాత్మా! ౬౧.

క. పారకులు, లైబరీలును
గారవముగ వీధి, వాడ, ♦ గ్రామాదులు నీ
పేర నెలకొల్ప దొడగిరి
కారుణ్యాంబోధి; మో. క. గాంధి మహాత్మా! ౬౨.

క. ఓరుపు లేదని 'కమ్యూనిస్ట్'
పారిటి కాంగ్రెసు పట్ల ♦ వైరము బూనెన్,
నీరీతుల ఖండించదు
గారవముగ జూచు; మో. క. ♦ గాంధి మహాత్మా! ౬౩.

క. జరుమను రష్యా యుద్ధము
బరుమా, జాపాను పోరు ♦ భరతావనినిన్
గిరగిర త్రిప్పఁగ జూచెను
కరడుగ నిను జేసి; మో. క. ♦ గాంధి మహాత్మా! ౯౪.

క. పరిపరి విధముల వర్ధన
అరి యాయుధ హతిని వంగు ♦ నంచున్ వెడలెన్
జరుమని, సుభాసుచంద్రుడు
కరుణాకరయోగి; మో. క. ♦ గాంధి మహాత్మా! ౯౫.

క. వరుసగ స్టేట్ కాంగ్రెసులు,
వరవడిగా నిల్చి రాష్ట్ర ♦ వాసుల బాధల్
తరువడిగ దీర్చ సాగిరి
కరుణాకర యోగి; మో. క. ♦ గాంధి మహాత్మా! ౯౬.

క. మనువము 'క్విట్ ఇండియా' సం
స్మరణం బాచరణయోగ్య ♦ సాధక మగుటన్
తిరుమంత్రము మా కయ్యది
కరుణాకరయోగి; మో. క. ♦ గాంధి మహాత్మా! ౯౭.

క. వెరువక మత కలహములకు
నరిగితి నవఖాళి కాలి ♦ నడకన్ నీతుల్
గఱపితి ధన్యాత్ముండవు
కరుణాకరయోగి; మో. క. ♦ గాంధి మహాత్మా! ౯౮.

క. నిరుపమ సత్యాగ్రహమను
కరవాలము చేతబూని ♦ గాంధీకీ జయ్
అరచెదు వీరుల బందీ
కరు లొనరిచి విడిచె మో. క. ♦ గాంధి మహాత్మా! ౯౯

ఆ శీ స్సు.

క. పరిపూర్ణాయువు నిచ్చుత!
సరసోక్తి మగండు హరుఁడు ♦ చక్రియు నీకుఁ
చిరమగు నారోగ్యంబిడ
కరములు జోడింతు; మో. క. ♦ గాంధి మహాత్మా! ౧౦౦.

క. భారత శీతోష్ణస్థితి
వారి నదీ నదము వనము ♦ పర్వత పంక్తుల్
ఆరోగ్యాయువు లిచ్చుత!
కారుణ్య పయోధి మో. క. ♦ గాంధి మహాత్మా! ౧౦౧.

ఆ కృ తి.

క. దరహాస వదన మిందిం
దిర నయనం బమల మాత్మ ♦ దేహమునతనం
బరచేతి మోడ్పు చూపుకు
కరములు జోడింతు; మో. క. ♦ గాంధి మహాత్మా! ౧౦౨.

సంపూర్ణమ్.



నిర్యాణము.

సీ. చనిపోయెనా? గాంధి ♦ సాఫల్య సన్మనో
రథ సిద్ధి గాంచి దు♦రంబు చించి
తరలెనా? మోహన ♦ దాసు భారత మాత
దౌర్భాగ్య మేమందు ♦ తారసిల్ల
అరిగెనా? మాహాత్ముఁ ♦ డవతార విక్రమణో
ద్యమనంబు మనమున ♦ తలఁచి తలఁచి
మరణించెనా? హేతు ♦ వరయక దుష్టుఁడొం
డొనరిచి నట్టి దు♦ష్కార కృతిని
గీ. మందభాగ్య మా భారత ♦ మాతకంటి
నీరు యేరులై పార త♦ద్వీర సూను
లక్కటక్కటా! యల్లాడ ♦ దిక్కులేక
కర్మ యోగి యేగెనె? స్వర్గ ♦ హర్మ్యములకు.

చ. కటు శరీరతు డైన నీ యొడలు ♦ గాసిలు వార్త క్షణంబులోన ని
క్కటి భువి విస్తరించ చయి♦దంబులు మానిరి ఘోరమారణం
బటయని విన్న దుష్టు డెవ♦డా యని చేతన శూన్యులైరి వి
స్ఫుటముగ శాంతి భద్రితలు ♦ పోయె నయోయని యంగలార్చు
(చున్.

శా. అల్లా! యెంతటి ఘోర వార్త ప్రచారం ♦ బై మింటిపై బ్రాకెనా
ఢిల్లీ పత్తనమే హరించెనని గాం♦ధీదేవునిన్ విన్న మా
యుల్లంబుల్ తలడిల్లె యిం కకట! ని♦న్నోదార్చువా రెవ్వరో
తల్లీ! భారత మాత గొడ్డు వైనన్ ♦ ధన్యాత్మవై యుంటువో

మ. నిను గోల్పోయి భరించు టెట్లు సమతన్ ♦ నీఛాయగా తీరువెల
న్ననుచున్నా నెహురూను జూపితివొ మా ♦ గత్యంతరంబుల్ మరె
వ్వని వీక్షించగ బల్కినావొ మరి నీ ♦ బాధల్ ప్రకోపించ కి
వ్వనకన్ మారణ మొందితో తలుప దుః♦ఖాంభోధి నుప్పొంగ
(గన్.

ఉ. పేర్చెడు బాంబు నీపయిని ♦ పేర్చిన వానిని నాదరింపగా
జాలిన గీత వాక్యముల ♦ జాలము గుప్పిన శాంతమూర్తి నీ
జోలికి రా వెరంతురు స♦జోలి యెఱుంగని నిన్నుచంపగా
జాలిన నీచు డీభరత ♦ జాతుడె! సోదరభాగ్యహర్తయే!



బాపూజీ చారిత్రిక తేదీలు.

2 వ అక్టోబరు	1869	జననము.
	1882	వివాహం
	1885	తండ్రిమరణం
	1887	మెట్రిక్ యందు తీర్ణత
	1890	బ్యారిస్టరీ పట్టము
	1897	దక్షిణాఫ్రికా ప్రయాణం
	1900	ట్రాన్స్వాల్ సత్యాగ్రహం
	1903	ఇండియన్ ఒపీనియన్ పత్రికాధిపత్యం
	1914	లండన్ ప్రయాణం
	1915	ఇండియాలో సేవ
6 వ ఏప్రిల్	1919	సత్యాగ్రహ దినం ప్రారంభం
	1920	విదేశ వస్తు బహిష్కరణ
	1922	బార్డోలి విప్లవం
ఐక్యతాసభ	1925	సబర్మతీ ఆశ్రమం కాంగ్రెసు అధ్యక్షత
మార్చి	1930	ఉప్పు సత్యాగ్రహం
జనవరి	1931	రౌండుటేబుల్ సమావేశం
	1933	సత్యాగ్రహం
	1934—1935	హరిజనోద్యమం
	1936	పాకిస్థాన్ చీలికయత్నం
	1940	,, బహిర్గతం వాక్స్వాతంత్ర్య సత్యాగ్రహం
ఆగస్టు	1942	క్రిప్సురాయబారం, క్విట్ ఇండియాతీర్మానం
	1943	దేశాయి, కస్తూరిబాల మరణం
	15-8-1947	కలకత్తా అల్లరులు
	18-8-1947	స్వాతంత్ర్యం
30 జనవరి	1948	బాపూజీ నిర్యాణము.

శ్రీకృష్ణ జన్మస్థానము.

దక్షిణాఫ్రికాలో (4 నెలలు)

10 జనవరి 1908 జోహన్సుబర్గులో ౨ నెలలు కాని 30 జనవరి విడుదల
15 అక్టోబరు 1908 వోక్ సుస్ట్రి ౨ నెలలు
9 నవంబరు 1913 దండీ ౯ నెలలు కాని 18 డిసెంబరు విడుదల

ఇండియాలో (6 ఏండ్ల 3 నెలల 11 రోజులు)

18	మార్చి	1922	ఎరవాడ	౬ ఏండ్లు కాని	7-2-1924	విడుదల
5	మే	1930	,,		26-1-1931	,,
4	జనవరి	1932	,,		8-5-1933	,,
4	ఆగస్టు	1933	,,	౧ ఏడాది	23-8-1933	,,
9	,,	1942	,,		6-5-1944	,,

ఉపవాసాలు. (107 రోజులు)

ఫిబ్రవరి	1918	అహమదాబాదు	3 రోజులు	కార్మికులకొరకు
నవంబరు	1921		౫ ,,	ప్రిన్సు వచ్చినప్పుడు
ఫిబ్రవరి	1922	చౌరీచౌరా	౫ ,,	
సెప్టెంబరు	1924		౨౧ ,,	మతకలహాలు
నవంబరు	1925	సబర్మతీ	౭ ,,	ఆశ్రమవాసుల నేరం
సెప్టెంబరు	1932		౬ ,,	మాక్డొనాల్డు వార్డుకొరకు
మే	1933		3 వారాలు	ఆత్మశుద్ధి కొరకు
ఆగస్టు	,,		౪ రోజులు	జైలు సౌకర్యాలకొరకు
మార్చి	1939	రాజకోట వివాదం	౪ ,,	
ఫిబ్రవరి	1943		3 వారాలు	ఆత్మశుద్ధికొరకు
సెప్టెంబరు	1947		౪ రోజులు	కలకత్తా కొట్లాట
జనవరి	1948		౬ ,,	మతకలహాలకు

ప్రకాశ ముద్రాక్షరశాల సూర్యాపేట.

మా వద్ద తెలుగు, హిందీ, ఇంగ్లీషు, ఉర్దు భాషలలో అన్ని రకముల అచ్చుపనులు, బైండింగుపనులు జరుగును. మీ కేవైన పై పనులు కావలసిన మా పైవిలాసమునకు వ్రాయుడు.